రైతన్నకు రేవంత్ సర్కార్ దగా

- నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్
- రైతులకిచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్
- వేముల సహా పలువురు బీఆర్‌ఎస్ నేతల ధ్వజం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తేతెలంగాణ): 'రైతు భరోసాకు కోతపెట్టిన కాంగ్రెస్ సర్కారు అన్నదాతకు గుండెకోతను మిగిల్చింది.. పెట్టుబడి సాయం కింద ఏటా రూ.15 వేలు ఇస్తామని రూ.12 వేలకు కుదించి దగా చేసింది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. రైతాంగాన్ని నమ్మించి పచ్చి మోసానికి పాల్పడ్డ సీఎం రేవంత్‌రెడ్డికి తగిన సమయంలో రైతులు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. 'ఎకరాకు రూ.15 వేలు ఇస్తామంటూ ఎన్నికల సభల్లో ఊదరగొడుతూ ఓట్లను కొల్లగొట్టి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి.. అదే గద్దెనెక్కినంక గద్దలా మారి అన్నదాతలను దారుణంగా వంచిస్తున్నారని శనివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ఎకరా కు రూ.12 వేల చొప్పున ఇస్తామని క్యాబినెట్ లో నిర్ణయించి రైతుల ఆశలను అడియాసలు చేశారని విరుచుకుపడ్డారు. కేసీఆర్ మానస పుత్రిక, ప్రపంచమే మెచ్చిన రైతుబంధు స్ఫూర్తికి వ్యతిరేకంగా మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. 'భూమి కలిగిన రైతులకే కాదు.. కౌలు రైతులకూ ఏటా రూ.15 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చి క్యాబినెట్‌లో ఆ ఊసే ఎత్తకుండా ధోకా చేశారని ధ్వజమెత్తారు. 'సగం మందికి రుణమాఫీ ఎగ్గొట్టి చిల్లర నాటకంగా మార్చేశారు.. బోనస్ మాటను బోగస్ చేశారు.. పంట బీమాను పత్తాలేకుండా చేశారు' అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వానకాలంలో ఎగ్గొట్టిన రైతుభరోసాతో కలిపి రూ.15 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటిదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

నమ్మి ఓటేస్తే నట్టేట ముంచింది..

ఎన్నికల ముందు ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్, ప్రస్తుతం రూ.12 వేలకు కుదించి కోతపెట్టి వారిని నట్టేట ముంచింది. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం కాదు. రైతు వంచక ప్రభుత్వం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కుతున్నారు. రైతు రుణమాఫీ, వానకాలం పంటకు పెట్టుబడి సాయం ఎగ్గొట్టి తీరని అన్యాయం చేశారు. ఆయనకు తగిన సమయంలో రైతులు బుద్ధి చెప్తారు.

- వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి

భరోసా కుదించడం అన్యాయం

ఎకరాకు రూ.15 వేలు రైతుభరోసా ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. రూ.12 వేలకు కుదించడం తీరని అన్యాయం. సంక్రాంతికి ఇస్తామని చెప్పి జనవరి 26కు వాయిదా వేయడం సిగ్గుచేటు. రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పిన సర్కారు ఇప్పటి వరకు విధివిధానాలు ఖరారు చేయకపోవడం విడ్డూరం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 11 విడతల్లో రైతుబంధును ఎలాంటి షరతుల్లేకుండా అందించింది. రేవంత్ ప్రభుత్వం కండీషన్లు పెడుతూ అన్నదాతను దగా చేస్తున్నది.

- దేవీప్రసాద్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

రైతులకు క్షమాపణ చెప్పాలి



కేసీఆర్ రైతుబంధును ఎకరాకు కేవలం రూ.10 వేలే ఇస్తున్నారు. మేం వస్తే రూ.15 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతుభరోసాను రూ.12 వేల చొప్పున మాత్రమే ఇస్తామని చెప్పడం బాధాకరం. అన్నదాతను మోసం చేసిన ముఖ్యమంత్రి వెంటనే క్షమాపణలు చెప్పాలి. ఇది ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం. ఇప్పటికైనా రైతుల ఆగ్రహం చవిచూడక ముందే హామీ ఇచ్చిన మేరకు రూ.15 వేల చొప్పున ఇవ్వాలి.

- వై సతీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్

బారాబర్ మోసమే!

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల సమయంలో అధికారాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఇబ్బడిముబ్బడిగా అలవికాని హామీలిచ్చింది. ఎన్నికల ప్రచారం కోసం రాష్ట్రానికి వచ్చిన ప్రియాంకగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే హామీల వర్షం కురిపించారు. సభ ఏదైనా సరే రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామంటూ జోరుగా ప్రచారం చేశారు. వరంగల్‌లో ప్రత్యేకంగా రైతు డిక్లరేషన్ కూడా వెల్లడించారు. రైతులకు రూ.15 వేల పెట్టుబడి సాయం చేస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. జోరు వాన కురుస్తుండగా 2022 మే 6న రైతులపై హామీల జల్లు కురిపించారు. ఆ తర్వాత సభల్లో ప్రియాంక, మల్లికార్జున ఖరే కూడా ఇదే హామీ ఇచ్చారు. చివరకు సోనియా, రాహుల్, ఖర్గే మాట తప్పారు. కాంగ్రెస్ సర్కారు వస్తే ఎకరాకు రూ.15 వేలు వస్తదని ఆశపడ్డ రైతులను నిరాశపరుస్తూ రూ.12వేలు మాత్రమే ఇస్తామని ప్రకటించారు.

కేసీఆర్ ఇచ్చింది 5 వేలు.. కాంగ్రెస్ ఇచ్చేది 6 వేలు

'కేసీఆర్ ఇచ్చే ముష్టి పదివేలు ఎందుకు? మా ప్రభుత్వం రాగానే ఎకరాకు రూ.15వేలు ఇస్తాం' అంటూ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పుడేమో రూ.15 వేల హామీని పక్కకునెట్టి, ఆ పదివేలకు మరో రెండు వేలు మాత్రమే కలిపి ఇస్తున్నారు. రైతు భరోసా కింద ఎకరానికి సీజన్‌కు రూ.7,500 చొప్పున ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు దీన్ని రూ.ఆరువేలకే పరిమితం చేసింది. ఈ లెక్కన ఇచ్చిన హామీలో ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.1,500 కోత పెట్టింది. గతంలో కేసీఆర్ సర్కారు ప్రతి సీజన్‌లో ఎకరాకు రూ.5 వేల చొప్పున ఇచ్చేది. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కేసీఆర్ ప్రభుత్వం కన్నా రూ.వెయ్యి మాత్రమే ఎక్కువగా ఇస్తుండటం గమనార్హం. వాస్తవానికి, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కేసీఆర్ సర్కారు కన్నా ప్రతి సీజన్‌లో ప్రతి ఎకరాకు రూ.2,500 అధికంగా ఇవ్వాలి.

కొండంత రాగం తీసి..

కొండంత రాగం తీసి.. కూని రాగం పాడిన చందంగా ఉన్నది కాంగ్రెస్ సర్కారు తీరు. రైతు భరోసాపై ఏదో చేస్తున్నట్టు హంగామా చేసిన ప్రభుత్వం తీరా కోతలకు పెద్దపీట వేసింది. ఈ మాత్రం దానికి మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేయడం, ఆ కమిటీ నివేదిక ఆధారంగా ఏదో చేస్తామని చెప్పడం ఎందుకో అర్థంకాదు. రైతు భరోసా కోసం ఏర్పాటైన మంత్రుల కమిటీ చేసిన హడావుడి మామూలుగా లేదు. రైతులను ఉద్ధరిస్తామన్నట్టుగా హెలికాప్టర్లలో వెళ్లి మీటింగ్‌లు, అభిప్రాయ సేకరణ పేరుతో పెద్దపెద్ద సభలు, వీడియో కాన్ఫరెన్స్‌లు.. ఇలా కమిటీ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. తీరా రూ.15వేల సాయాన్ని రూ.12వేలకు కుదించింది. సాగుకు యోగ్యమైన భూములకు ఇస్తామని ప్రకటించింది.

సాగు యోగ్యమైన భూమి అంటే ఏమిటో అర్థం చెప్పని సీఎం

శనివారం ప్రెస్‌మీట్‌లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సాగు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని ప్రకటించారు. అయితే సాగు యోగ్యమైన భూమి అంటే ఏమిటో అర్థం మాత్రం చెప్పలేదు. ఇంతకుముందు సీఎం తోపాటు మంత్రులంతా సాగు చేసిన భూమికి మాత్రమే రైతుభరోసా ఇస్తామని బహిరంగంగానే ప్రకటించారు. సాగు యోగ్యమైన భూమికి మాత్రమే ఇస్తామని సీఎం చెప్తుంటే.. మంత్రులేమో సాగు చేసిన భూమికి మాత్రమే ఇస్తామని చెప్తున్నారు. సాగు యోగ్యమైన భూమి వేరు.. సాగు చేసిన భూమి వేరు. వానకాలంలో రాష్ట్రంలో సాగునీరు పుష్కలంగా ఉండటంతో 136 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. యాసంగి సీజన్‌లో సాగు నీళ్ల కొరతతో 60 లక్షల ఎకరాలకే పరిమితమవుతుంది. ఇందులో మిగిలిన 76 లక్షల భూమి సాగు యోగ్యమైన భూమి అయినప్పటికీ, నీళ్ల కొరతతో సాగు చేయలేదు. అంటే యాసంగిలో సాగు యోగ్యమైన 136 లక్షల ఎకరాల భూమికి రైతుభరోసా ఇస్తరా? లేక సాగు చేసిన 60 లక్షలకే ఇస్తరా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఎకరానికి మూడు వేల కోత

కాంగ్రెస్ సర్కారు ఎకరానికి రూ.3వేల కోత పెట్టింది. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. రైతు భరోసా కింద ఏడాదికి ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలి. కానీ, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి రూ.12 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడంతో ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి రూ.3వేలు కోత పెట్టినట్టయ్యింది

హామీల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం

ఆరు గ్యారెంటీలు, హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు 365 రోజులు దాటినా అమలు చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. కోతలే లక్ష్యంగా కొన్ని పథకాలను అరకొరగా అమలు చేస్తున్నది. ఇప్పటికే రుణమాఫీలో ఎడాపెడా కోతలు పెట్టి, కొన్ని లక్షల మందికి ఎగనామం పెట్టిందనే విమర్శలున్నాయి. మొత్తం 42 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ప్రకటించి, చివరికి 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసింది. ఇంకా 16.65 లక్షల మంది రైతులకు రూ.10,384 కోట్లు రుణమాఫీ చేయకుండా ఎగ్గొట్టింది.

అతిపెద్ద యూటర్న్



ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలకు కుదించడం దారుణం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అతిపెద్ద యూటర్న్. 2024లో అసలు రైతుభరోసానే వేయలేదు. అన్నదాతలను వంచనకు గురి చేసిన కాంగ్రెస్ సర్కార్‌కు సరైన బుద్ధి చెప్పడం ఖాయం.

- మన్నె క్రిశాంక్, బీఆర్‌ఎస్ నేత

రాహుల్‌గాంధీ ఏం చెప్తారు?



రైతు ఆత్మగౌరవంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆటలాడుకుంటున్నరు. రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని నమ్మబలికి ఓట్లేయించుకున్న తర్వాత రూ.12 వేలకు కుదించి వంచించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో గొప్పలు చెప్పుకున్న రాహుల్‌గాంధీ ఇప్పుడు ఏం సమాధానం చెప్తారు. కాంగ్రెస్ పార్టీకి రైతులు ఊరూరా ఘోరీ కట్టే రోజు దగ్గరలోనే ఉన్నది.

- పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఇది కోతల ప్రభుత్వం



రైతు భరోసా పేరిట గొప్పలు చెప్పిన రేవంత్‌రెడ్డి, ఎకరాకు రూ.12 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనం. ఓట్లేసిన రైతులను నయవంచనకు గురిచేశారు. నిధుల్లేవనే సాకుతో కోతలు పెట్టడం దారుణం. ఇది చేతల ప్రభుత్వం కాదు. కోతల ప్రభుత్వం.

- కురువ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేత

కోతలు పెట్టేందుకే రైతుభరోసా దరఖాస్తులు

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): కోతలు పెట్టేందుకే ప్రభుత్వం మళ్లీ రైతు భరోసా దరఖాస్తులు స్వీకరిస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. కేసీఆర్ సర్కారు హయాంలో తీసుకున్న వివరాలు ఉండగా మళ్లీ దరఖాస్తులు ఎందుకని శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని మోసం చేసిందని మండిపడ్డారు. గ్రామసభల్లో రైతు భరోసా వివరాలు సేకరించిన ప్రభుత్వం, తిరిగి దరఖాస్తు చేసుకోవాలనడం హాస్యాస్పదమని విమర్శించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఎన్నికల హామీల అమలులో తాత్సారం చేస్తున్నదని దుయ్యబట్టారు. చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రైతు భరోసా కింద 15వేలు ఇవ్వాల్సిందే

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, జనవరి 4: కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఎకరాకు రూ.15 వేలు ఇస్తానని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలే అనడం సరికాదని అన్నారు. రైతులను మోసం చేయడం ఒక్క రేవంత్‌రెడ్డికే సాధ్యమని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ విషయంలో మాట మార్చినట్టుగానే రైతు భరోసా విషయంలోనూ మాటమారుస్తున్నారని మండిపడ్డారు. ఎకరాకు 15వేలు ఇచ్చే వరకూ బీఆర్‌ఎస్ తరఫున పోరాటం చేస్తామని, రైతులకు అండగా నిలుస్తామని స్పష్టంచేశారు.

క్యాబినెట్‌లో భిన్నాభిప్రాయాలు

- *15 వేలు ఇవ్వాల్సిందేనన్న కొందరు మంత్రులు*
- *సీఎంకు అనుకూలంగా మరికొందరి వాదన*

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రైతు భరోసాపై క్యాబినెట్‌లో మంత్రు ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని సమాచారం. ముందుగా సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసాకు సంబంధించిన ప్రతిపాదనను మంత్రుల ముందుంచి, ఎకరాకు 15 వేల చొప్పున ఇస్తే ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని వివరించారని తెలిసింది. కాబట్టి ముందుగా రూ.12 వేలకు పెంచాలని భావిస్తున్నట్టు చెప్పారని సమాచారం. ఈ సందర్భంగా నలుగురు కీలక మంత్రులు కలుగజేసుకొని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్టు గా రూ.15 వేలకు పెంచాలని సూచించినట్టు తెలిసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పామని, ఇప్పటికే ఏడాది ఆలస్యం అయ్యిందని, రైతులు గుర్రుగా ఉన్నారని చెప్పినట్టు సమాచారం. ఇది రాబోయే స్థానిక సంస్థల ఎన్నిక ల్లో ప్రభావం చూపిస్తుందని, కాబట్టి, ఎన్నికల హామీ మేరకు ఇవ్వాలని సూచించినట్టు సమాచారం. కానీ, సీఎంకు అనుకూలంగా ఉన్న మరికొందరు మంత్రులు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుకోకుండా అడిగితే ఎలా? అని ప్రశ్నించినట్టు సమాచారం. ముందుగా రూ.12వేలు ఇద్దామని, ఆర్థిక వెసులుబాటును బట్టి మరికొంత పెంచుదామని ప్రతిపాదించినట్టు తెలుస్తున్నది. ఇలా సుదీర్ఘంగా చర్చ జరిగిన అనంతరం సీఎం స్పందిస్తూ.. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి రూ.12 వేలు మాత్రమే ఇవ్వగలమని స్పష్టం చేసినట్టు సమాచారం. ఈ విషయాన్ని మీడి యా ముందుకొచ్చి ఎవరు చెప్పినా ప్రజల్లో బదనాం అవుతారని కొందరు మంత్రులు చె ప్పడంతో.. తానే మీడియా ముందు మాట్లాడుతానని సీఎం చెప్పినట్టు తెలుస్తున్నది. సా ధారణంగా క్యాబినెట్ బ్రీఫింగ్ బాధ్యతను మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, పొన్నం కు అప్పగించారు. కానీ, ఈసారి ప్రత్యేకంగా సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి వివరాలు వెల్లడించడానికి ఇదే కారణమని చర్చ జరుగుతున్నది.

రైతు భరోసా 12 వేలు

- 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు
- భూమిలేని వారికి 12 వేలు సాయం
- క్యాబినెట్ భేటీలో నిర్ణయం: సీఎం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా కింద రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని రూ.12 వేలకు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. అనంతరం సీఎం మీడియాకు వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి రైతు భరోసాను ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచాలని నిర్ణయించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని వ్యవసాయయోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా ఇస్తామని స్పష్టంచేశారు. వ్యవసాయ యోగ్యం కాని భూములకు, రాళ్లు-రప్పలు, గుట్టలు, మైనింగ్ భూములు, నాలా కన్వర్షన్ జరిగిన భూములకు, పరిశ్రమల కోసం తీసుకున్న భూములకు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు రైతు భరోసా ఉండదని తెలిపారు. భూమి లేని రైతు కుటుంబాలకు ఏటా రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈ పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అనే పేరు పెట్టినట్టు చెప్పారు. దీంతోపాటు కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ఈ పథకాలన్నీ ఈ నెల 26 నుంచి ప్రారంభిస్తామని ప్రకటించారు.

మరిన్ని క్యాబినెట్ నిర్ణయాలు

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని నిర్ణయం.
- సింగూరు ప్రాజెక్టు కాలువకు మంత్రి దామోదర రాజనర్సింహ తండ్రి, దివంగత మంత్రి సిలారపు రాజనర్సింహ పేరు పెట్టాలని నిర్ణయం.
- జూరాల నుంచి కృష్ణా జలాలను తీసుకొచ్చి మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా మరింత ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఉన్న మార్గాలు, ప్రత్యామ్నాయాలను పరిశీలించేందుకు సాంకేతిక నిపుణుల కమిటీని నియమించాలని నిర్ణయం. ఎక్కడ నీటి లభ్యత ఉన్నది? ఎక్కడనుంచి ఎంత నీటిని తీసుకునే వీలున్నది? ఎక్కడెక్కడ రిజర్వాయర్లు నిర్మించాలి? ఇప్పుడున్న ప్రాజెక్టులకు మరింత నీటిని తీసుకొనేందుకు సాధ్యాసాధ్యాలపై కమిటీ అధ్యయనం చేస్తుంది.
- మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ తాగునీటికి తరలించే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ స్కీమ్ ఫేజ్-2, ఫేజ్-3కి గ్రీన్‌సిగ్నల్. గతంలో 15 టీఎంసీలకు ప్రతిపాదించిన ఈ పథకాన్ని భవిష్యత్ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీలకు పెంచేందుకు ఆమోదం.
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో 588 కారుణ్య నియామకాలకు ఆమోదం.
- కొత్తగూడెంను మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదముద్ర.
- ములుగు జిల్లా కేంద్రాన్ని మున్సిపాలిటీగా మారుస్తూ నిర్ణయం.

మరో రైతు ఆత్మహత్య

రైతుభరోసా రాక.. సాగు కోసం అప్పులు భారమై..

తలమడుగు, జనవరి 4 : రైతుభరోసా రాక.. సాగు కోసం చేసిన అప్పులు భారంగా మారడంతో ఆదిలాబాద్ జిల్లాలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తలమడుగు మండలం ఝురి గ్రామానికి చెందిన రైతు గడ్డం పోతారెడ్డి (51) తనకున్న ఏడెకరాల భూమిలో పత్తి వేశాడు. రైతుభరోసా రాకపోవడంతో సాగు కోసం దాదాపు రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. సరైన దిగుబడులు రాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై శనివారం ఉదయం చేను వద్ద పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికి త్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెం దాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అంజమ్మ తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించండి

- రవాణా శాఖ మంత్రి పొన్నం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగం గా ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై శనివారం సచివాలయం నుం చి కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రతిరోజు సుమారు 20 మంది మరణిస్తున్నారని, దీనిని పూర్తిగా తగ్గించడానికి కలిసి పనిచేయాలని సూచించారు.

అగ్నిమాపకశాఖను బలోపేతం చేస్తున్నాం

- మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అగ్నిమాపకశాఖను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. శనివారం ఫైర్ ట్రైనింగ్ సెంటర్‌లో 196 మంది డ్రైవర్ ఆపరేటర్ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తు ఎక్కడ జరిగినా మేమున్నాం అనే ధైర్యం కల్పించేలా ఉండాలని సూచించారు.

దివ్యాంగులను మోసం చేసిన రేవంత్

పింఛన్ పెంపు హామీ ఏమైందని నిలదీసిన మందకృష్ణ

మలక్‌పేట, జనవరి 4: అధికారంలోకి వచ్చేందుకు దివ్యాంగులకు అనేక హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారం చేపట్టాక ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. అంధుల అక్షర ప్రదాత లూయీస్ బ్రెయిలీ జయంతి వేడుకలకు దివ్యాంగుల శాఖ మంత్రి సీతక్క హాజరుకాకపోవడం బాధాకరమని తెలిపారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ మలక్‌పేట నల్లగొండ చౌరస్తాలోని వికలాంగుల జాతీయ ఉద్యాయవనంలో లూయిస్ విగ్రహానికి మందకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు, చేయూత పెన్షన్లను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఏడాది గడుస్తున్నా ఇంతవరకు అమలు పరుచలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై దివ్యాంగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారు. 45 లక్షలకు పైబడి ఉన్న చేయూత పెన్షన్‌దారులు రేవంత్‌రెడ్డికి త్వరలోనే కర్రుకాల్చి వాత పెట్టనున్నారు. ఏపీలో చంద్రబాబు దివ్యాంగులకు పెన్షన్ పెంచుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే అమలు చేశారు. మరి రేవంత్‌రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదు' అని నిలదీశారు.

పైసలు మిగలట్లే!

- అందుకే అభివృద్ధి చేయట్లే!
- పరోక్షంగా అంగీకరించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి వస్తున్న ఆదాయం వేతనాలు, ఖర్చులకే సరిపోతున్నదని, అందుకే ఏడాదిగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడంలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరోక్షంగా అంగీకరించారు. సచివాలయంలో శుక్రవారం ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్రానికి ప్రతినెల రూ.18,500 కోట్ల రాబడి వస్తుండగా, ఉద్యోగుల వేతనాలకు రూ.6,500 కోట్లు, అప్పులు చెల్లించేందుకు రూ.6,500 కోట్లు, రూ.5,500 ఉచిత పథకాలకు ఖర్చు చేస్తున్నాం. కనీస అవసరాలకు ప్రతినెల రూ.22,500 కోట్లు కావాలి. వచ్చిన ఆదాయంతో పోలిస్తే రూ.4,000 కోట్లు తక్కువ పడుతున్నది' అని సీఎం వివరించారు. దీనిపై ఆర్థిక నిపుణులు స్పందిస్తూ.. ఆదాయ, వ్యయాలపై సీఎం అవగాహన లేమికి నిదర్శమని ఆయన వ్యాఖ్యానించారు.

నిజాం షుగర్స్ పునరుద్ధరణపై మెలిక

- పది వేలకు పైగా ఎకరాల్లో చెరుకు సాగు చేస్తేనే క్రషింగ్
- ఫ్యాక్టరీని నడపడం సాధ్యమన్న ప్రభుత్వం
- పరోక్షంగా రైతులపైనే బాధ్యత మోపిన సర్కారు
- మొక్కుబడిగా చెరుకు రైతుల అవగాహన సదస్సు
- ఫ్యాక్టరీ వయబిలిటీ కాకుంటే తరలిస్తామన్న ఎమ్మెల్యే వ్యాఖ్యలపై అనుమానాలు

చెరుకు రైతుల సదస్సులో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు పోచారం, భూపతిరెడ్డి, కలెక్టర్, షుగర్ కేన్ కమిషనర్

బోధన్, జనవరి 4:నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామన్న ప్రభుత్వం.. ఆ బాధ్యతను రైతులపైకి నెట్టేసింది. 10 వేల ఎకరాల్లో చెరుకు సాగు చేస్తేనే ఫ్యాక్టరీ పునరుద్ధరణ సాధ్యమని తేల్చి చెప్పింది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన చెరుకు రైతుల సదస్సులో బాన్సువాడ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, భూపతిరెడ్డి, షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, షుగర్ కేన్ కమిషనర్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీని తెరిపించాలంటే ముందుగా విస్తారంగా చెరుకు పండించాల్సి ఉంటుందని చెప్పడం ద్వారా పరోక్షంగా ఫ్యాక్టరీ పునరుద్ధరణ బాధ్యతను రైతులపైకి నెట్టేశారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని, రైతులు వరి పంటకు బదులుగా చెరుకును పండిస్తే లాభం వస్తుందని చెప్పారు. ఈ ఏడాది చెరుకు విత్తనం పంటను 300 నుంచి 400 ఎకరాల్లో వేసే విషయాన్ని రైతులు పరిశీలించాలని సూచించారు. వచ్చే సీజన్‌లో చెరుకు పంటను విస్తారంగా వేస్తే, క్రషింగ్ కోసం నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి యంత్రాలకు మరమ్మతులు చేసి అదే ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ చేస్తామని చెప్పారు. చక్కెర రికవరీ తక్కువగా వస్తే, కొత్త ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తామని, అవసరమైతే ఫ్యాక్టరీని తరలిస్తామనడంపై కొత్త అనుమానాలు మొదలయ్యాయి. చెరుకు పండించాలని నేతలందరూ చెప్పినా, ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ప్రభుత్వ ఆలోచన వేరే విధంగా ఉందన్న ప్రచారం జరుగుతున్నది. నిజాం షుగర్స్ పునరుద్ధరణ చేయలేమన్న నిర్ణయానికి వచ్చిన ప్రభుత్వ పెద్దలు రైతులు చెరుకు పండించలేదు కాబట్టే ఫ్యాక్టరీని తెరవలేదంటూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. సదస్సుకు అధికార పార్టీకి చెందిన వారిని మాత్రమే ఆహ్వానించి, మిగతా రైతులను పట్టించుకోకపోవడం, చెరుకు రైతు సంఘాల నాయకులను పిలవకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చెరుకు రైతుల సదస్సులో రైతుల కంటే అధికార పార్టీ నాయకుల హడావుడే ఎక్కువగా కనిపించడం విశేషం.

పోలవరంపై ఐఐటీహెచ్‌తో అధ్యయనం

- నెల రోజుల్లోగా నివేదిక అందజేయాలి
- భద్రాచలం ముంపుపైస్టడీ చేయించాలి
- పోలవరం-బనకచర్ల లింక్‌పై అభ్యంతరం తెలపాలి
- ఏపీకి, కేంద్రానికి లేఖలు రాయాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణపై పడే ప్రభావంపై ఐఐటీ హైదరాబాద్ నిపుణుల బృందంతో సమగ్ర అధ్యయనం జరిపించి నెల రోజుల్లోగా నివేదిక అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రాచలం ముంపుపై కూడా అధ్యయనం చేయించాలని సూచించారు. శనివారం ఆయన రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పోలవరం నుంచి బనకచర్ల లింక్ ప్రాజెక్టును త్వరలో చేపడతామని ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఆ అంశంపై ఈ భేటీలో సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతోపాటు కొత్తగా చేపట్టనున్న లింక్ ప్రాజెక్టుతో తెలంగాణకు వాటిల్లే నష్టాన్ని అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం వల్ల ఏర్పడే ముంపు, భద్రాచలం ఆలయంపై పడే ప్రభావాన్ని అధ్యయనం జరిపించాలని ఆదేశించారు. ఐఐటీహెచ్ బృందంతో కో-ఆర్డినేషన్ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని సూ చించారు. వరద జలాల ఆధారంగా ఏపీ సర్కారు కొత్తగా చేపట్టిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, దీనిపై తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలను తెలియజేస్తూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, జీఆర్‌ఎంబీకి, కేంద్ర జల్‌శక్తి శాఖకు లేఖలు రాయాలని అధికారులకు స్పష్టం చేశారు.